ఆనందం డబుల్

కేసీఆర్‌నగర్‌ను ప్రారంభించిన సీఎం

రామచంద్రాపురం(పటాన్‌చెరు) : తెల్లాపూర్ మున్సిపాలిటీ పరిధిలోని కొల్లూర్‌లో ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్మించిన డబుల్ బెడ్ రూమ్ ఇళ్లను(కేసీఆర్ నగర్) గురువారం ముఖ్యమంత్రి కేసీఆర్ లాంఛనంగా ప్రారంభించారు. ఆ ప్రాంగణంలోని పైలాన్‌ను మంత్రులు కేటీఆర్, హరీశ్ రావు, ప్రశాంత్ రెడ్డి, తలసాని శ్రీనివాస్ యాదవ్, మేయర్ విజయలక్ష్మిలతో కలసి ఆవిష్కరించారు. అనంతరం బ్యాటరీ వాహనంపై ప్రాంగణాన్ని సందర్శించారు. ఈ సందర్భంగా పటాన్‌చెరు, శేరిలింగంపల్లి, రాజేంద్రనగర్ నియోజకవర్గాలకు చెందిన లబ్ధిదారులకు రెండు పడకల ఇళ్ల కేటాయింపు పత్రాలను కేసీఆర్ అందించారు.



ఇంటిలో పూజ చేసుకుంటున్న సుజాత కుటుంబం

అనంతరం రాష్ట్ర గృహనిర్మాణ శాఖ మంత్రి వేముల ప్రశాంత్ రెడ్డి లబ్ధిదారులతో గృహప్రవేశం చేయించారు.

కేసీఆర్‌కు రుణపడి ఉంటాం

సొంతఇంటి కలను నిజం చేసిన కేసీఆర్‌కు రుణపడి ఉంటాం. నేను ఓ పరిశ్రమలో పని చేస్తున్నా. నా భర్త రాజు డ్రైవర్. 2016లో ఇంటి కోసం దరఖాస్తు చేసుకున్నాం. ప్రభుత్వం మాకు డబుల్ బెడ్‌రూం ఇల్లు కేటాయించడం ఆనందంగా ఉంది.

- చాకలి సుజాత, కాటేదాన్ (రాజేంద్రనగర్)

చాలా ఆనందంగా ఉంది



మాకు డబుల్ బెడ్ రూం ఇంటిని కేటాయించడం ఆనందంగా ఉంది. నా భర్త హనుమంతు నాయక్ డ్రైవర్. నేను కూలీకి వెళ్తాను. బీఆర్‌ఎస్ ప్రభుత్వం మాకు సొంత ఇంటి కలను నిజం చేసింది.

- కేతావత్ కీర్తి, రాజేంద్రనగర్

పేదోళ్ల ప్రభుత్వం



పేదోళ్ల అభివృద్ధికి సీఎం కేసీఆర్ కృషి చేస్తున్నారు. ఇది పేదోళ్ల ప్రభుత్వం కాబట్టే మాకు రెండు పడకల ఇల్లు వచ్చింది. మంచి విలువైన స్థలంలో ఇళ్లను ఇచ్చారు.

- శారద, గచ్చిబౌలి (శేరిలింగంపల్లి)

మా ఓటు కేసీఆర్‌కే..



ఏళ్ల తరబడి అద్దె ఇంటిలో ఉంటున్నాం. అద్దెలు కట్టలేక ఇబ్బంది పడ్డాం. నా భర్త ఫారుఖ్ ఆటో డ్రైవర్. సంపాదించినదంతా అద్దె కట్టడానికే సరిపోయేది. 2020లో ఇంటి కోసం దరఖాస్తు పెట్టుకున్నాం. ఇప్పుడు మా సొంత ఇంటి కల నిజమైంది. మా ఓటు కేసీఆర్‌కే వేస్తాం.

- ఆసియాబేగం, గోకుల్‌నగర్ (పటాన్‌చెరు)

సొంతిల్లు కల నెరవేరింది



పేదోళ్ల కష్టం తెలిసిన వ్యక్తి కేసీఆర్. ఈ ప్రభుత్వం అనేక సంక్షేమ కార్యక్రమాలను చేపడుతుంది. నా భర్త చనిపోవడంతో కూలీకి వెళ్తూ జీవనం సాగిస్తున్నా. కేసీఆర్ ప్రభుత్వం సొంత ఇంటి కలను నిజం చేసి మా జీవితంలో ఆనందం నింపింది.

- రేణుక, అంబేడ్కర్‌కాలనీ (పటాన్‌చెరు)

గల్లీగల్లీలో పాదయాత్ర చేశా

పటాన్‌చెరుతో అనుబంధాన్ని పంచుకున్న కేసీఆర్

పటాన్‌చెరు: పట్టణంలోని గెస్ట్‌హౌస్‌లో మూడు రోజులు ఉన్నానని, గల్లిగల్లీలో తిరిగినట్టు ముఖ్యమంత్రి కేసీఆర్ గుర్తుచేశారు. అప్పటి ఎమ్మెల్యే సదాశివరెడ్డితో కలిసి పట్టణ సమస్యలు పరిష్కరించామన్నారు. ఈ ప్రాంత సమస్యలపై తనకు పూర్తి అవగాహన ఉందన్నారు. గురువారం పట్టణంలోని సూపర్‌స్పెషాలిటీ ఆస్పత్రి శంకుస్థాపన శిలాఫలకాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో సీఎం కేసీఆర్ స్థానిక నేతలను పేర్లతో పిలుస్తూ చేసిన ప్రసంగం అందరినీ ఆకట్టుకుంది. ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే కె.సత్యనారాయణ, మాజీ ప్రొటెం స్పీకర్ భూపాల్‌రెడ్డి పేర్లు ప్రస్తావిస్తూ వారు విన్నవించిన సమస్యలను వివరించారు. పటాన్‌చెరుకు రెవెన్యూ డివిజన్ కావాలని ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి తనను కలిసినప్పుడల్లా కోరారన్నారు. పటాన్‌చెరు వరకు మెట్రో కావాలని మాజీ ఎమ్మెల్యే సత్యనారాయణ కోరారని తెలిపారు. సీఎం ప్రసంగిస్తున్నప్పుడు మహిపాల్‌రెడ్డి పేరు ప్రస్తావించిన ప్రతీ సందర్భంలోనూ స్థానిక బీఆర్‌ఎస్ నాయకులు, కార్యకర్తలు సభలో పెద్దఎత్తున ప్రతిస్పందించారు. మహిపాల్‌రెడ్డి నేతృత్వంలో పటాన్‌చెరు అభివృద్ధి పథంలో ముందుకుపోతోందని కేసీఆర్ అన్నప్పుడు సభలో ఎమ్మెల్యే అభిమానులు, కార్యకర్తలు కేరింతలు కొట్టారు. ఎమ్మెల్యే తన ప్రసంగంలో కోరిన అన్ని సమస్యలకు ముఖ్యమంత్రి సానుకూలంగా స్పందించారు. అప్పటికప్పుడు వరాలు కురిపించారు. సభలో తొలుత ఎమ్మెల్యే మాట్లాడుతూ పటాన్‌చెరులో జరుగుతున్న అభివృద్ధిని వివరించారు. గతంలో తాను ఎంపీటీసీగా ఉన్న కాలంలో కేసీఆర్ అప్పటి ప్రభుత్వంలో మంత్రి హోదాలో ఈ ప్రాంతంలో పర్యటించారని గుర్తు చేశారు. అందుకే ఎక్కువ విషయాలు చెప్పనంటూనే ఈ ప్రాంత వాసుల కోరికలను ముఖ్యమంత్రికి ఎమ్మెల్యే వివరించారు. ఈ ప్రాంతంలో పాలిటెక్నిక్ కాలేజీ కావాలని కోరారు. మెట్రో రైలు ఇస్నాపూర్ వరకు నడిపించాలని విజ్ఞప్తి చేశారు. ఉస్మాన్‌నగర్‌లో ఐటీ పార్కు ఏర్పాటు చేయాలని కోరారు.



సీఎం కేసీఆర్‌తో మాట్లాడుతున్న ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి

పట్టణమంతా గులాబీమయం

ముఖ్యమంత్రి పర్యటన సందర్భంగా పటాన్‌చెరు పట్టణమంతా గులాబీమయమైంది. సీఎంను స్వాగతించేందుకు వచ్చిన బీఆర్‌ఎస్ నేతలతో పట్టణం కిటకిటలాడింది. బస్టాండ్ పక్కన నుంచి సభాస్థలి వరకు నాయకులు, కార్యకర్తలతో నిండిపోయింది. ముత్తంగి నుంచి పట్టణం వరకు ఎటు చూసినా గులాబీ జెండాలు, స్వాగత తోరణాలు, ఫ్లెక్సీలే కనిపించాయి. నియోజకవర్గ పరిధిలోని ప్రతీ గ్రామం నుంచి కార్యకర్తలు కదిలివచ్చారు. కాగా సభాస్థలికి సీఎం గంటన్నర ఆలస్యంగా వచ్చారు. జాతీయ రహదారి పొడవునా మైక్‌లు ఏర్పాటు చేశారు. కళాకారుల బృందాల పాటలు, నృత్యాలు అందరినీ ఆకట్టుకున్నాయి. ప్రెస్‌గ్యాలరీలో విలేకరులు కూర్చునేందుకు సరైన ఏర్పాట్లు చేయక పోవడంతో కొందరు నిలబడే వార్తలు సేకరించాల్సి వచ్చింది.

క్లుప్తంగా...

బస్తీ దవాఖానకు మంచాలు అందజేత



బస్తీ దవాఖానకు మంచాలు అందజేసిన మున్సిపల్ వైస్‌చైర్మన్ బండిగోపాల్ యాదవ్

శంషాబాద్: పట్టణంలోని 14వ వార్డులోని ఆయుష్మాన్ భారత్ వెల్‌నెస్ కేంద్రంగా గుర్తించబడ్డ బస్తీ దవాఖానాకు శంషాబాద్ మున్సిపల్ వైస్‌చైర్మన్ బండిగోపాల్ యాదవ్ గురువారం రెండు మంచాలు, ఫర్నిచర్‌ను అందజేశారు. గతంలో బస్తీ దవాఖానా నిర్మాణంలో కూడా ఆయన తన సొంత నిధులు ఖర్చు చేశారు. ఈ సందర్భంగా ఆస్పత్రిని పరిశీలించారు. వైద్యురాలు దివ్య తదితరులు పాల్గొన్నారు.

ట్రాఫిక్ నిబంధనల ఉల్లంఘన.. 11 మందికి జైలు

శంషాబాద్: మద్యం తాగి డ్రైవింగ్, మైనర్ డ్రైవింగ్ తదితర నిబంధనలు ఉల్లంఘించిన 19 మందిని ఆర్‌జీఐఏ ట్రాఫిక్ పోలీసులు గురువారం రాజేంద్రనగర్ పదో మెట్రోపాలిటన్ కోర్టులో హాజరుపర్చారు. ఇందులో 11 మంది కనిష్టంగా ఒకరోజు నుంచి గరిష్టంగా ఐదురోజుల జైలు శిక్షను న్యాయమూర్తి విధించారు. మిగతా ఉల్లంఘనులకు జరిమానా విధించారు. ట్రాఫిక్ నిబంధనలు ఉల్లంఘించి వాహనాలు నడిపితే జరిమానాతో పాటు జైలు శిక్ష తప్పదని ఆర్‌జీఐఏ ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ రామకృష్ణ తెలిపారు.

స్నేహితుడి కుటుంబానికి బాసటగా..



మృతి చెందిన స్నేహితుడి కుమారుడికి నగదు అందజేస్తున్న తోటి స్నేహితులు

రాజేంద్రనగర్: వారంతా చిన్ననాటి స్నేహితులు, ఒకే పాఠశాలలో చదువుకుని ప్రస్తుతం వివిధ రంగాల్లో స్థిరపడ్డారు. తమ స్నేహితుడు మృతి చెందడంతో అతడి కుటుంబం ఆర్థికంగా ఇబ్బందులు పడుతున్న విషయం తెలుసుకుని బాసటగా నిలిచారు. శివరాంపల్లి ప్రాంతానికి చెందిన సంగం శ్రీధర్ ఇటీవల మృతి చెందాడు. నిరుపేద కుటుంబం కావడంతో చిన్ననాటి స్నేహితులైన బండారు శంకర్, హరికిషన్ జీ, రణదీర్ రెడ్డి, లక్ష్మణ్, బల్వంత్‌రెడ్డిలకు తెలిసింది. దీంతో వారంతా డబ్బులు పోగు చేసి గురువారం ఉదయం శ్రీధర్ ఇంటికి వెళ్లి తమవంతుగా రూ. 50 వేల రూపాయల నగదును అతడి కుమారుడికి అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రానున్న రోజుల్లో శ్రీధర్ కుటుంబానికి తమవంతు సహాయ సహకారాలు అందిస్తామన్నారు.

ఎంపీని కలిసిన బీఆర్‌ఎస్ నేతలు



ఎంపీ రంజిత్‌రెడ్డిని కలిసిన జిల్లా నాయకులు మిద్దెల సురేందర్‌రెడ్డి తదితరులు

అత్తాపూర్: రంగారెడ్డి జిల్లా బీఆర్‌ఎస్ నేతలు చేవెళ్ల ఎంపీ రంజిత్‌రెడ్డిని గురువారం ఆయన నివాసంలో కలిశారు. మిద్దెల సురేందర్‌రెడ్డి, మిద్దెల సురేష్‌రెడ్డిల ఆధ్వర్యంలో స్థానిక అభివృద్ధి కార్యక్రమాలపై వినతిపత్రం అందజేశారు. అత్తాపూర్ గోల్డెన్ ప్యాలెస్ చౌరస్తాలో ఉన్న ట్రాఫిక్ ఆంక్షలను తొలగించి స్థానికులకు ఇబ్బందులు లేకుండా ప్రత్యామ్నాయ మార్గం చూపేందుకు యుద్ధప్రాతిపదికన ఏర్పాట్లు చేయాలని దక్షిణ మండల జోనల్ కమిషనర్ అశోక్‌సామ్రాట్‌ను ఎంపీ ఆదేశించారు. అత్తాపూర్ 122 పిల్లర్ నుంచి ఇందిరాగాంధీ విగ్రహం వరకు ఉన్న సమస్యలను వెంటనే పరిష్కరించాలన్నారు. ఎంపీని కలిసిన వారిలో శ్రీధర్‌రెడ్డి, ప్రశాంత్‌రెడ్డి, రవి, శంకర్ తదితరులున్నారు.

నేటి నుంచి శతచండీ మహాయాగం

చార్మినార్: ఆషాఢమాసం బోనాల ఉత్సవాలను పురస్కరించుకొని మీరాలంమండి మహంకాళేశ్వర ఆలయంలో ఈనెల 23వ తేదీ నుంచి రుద్ర సహిత శ్రీ శతచండీ మహాయాగంను పెద్ద ఎత్తున నిర్వహిస్తున్నట్లు ఆలయ కమిటీ చైర్మన్ గాజుల అంజయ్య తెలిపారు. హంపీ పీఠాధిపతి విరూపాక్ష విద్యారణ్య భారతి స్వామి ఈ మహాయాగాన్ని ప్రారంభించనున్నారన్నారు. ఈ మహాయాగం వచ్చే నెల 14వ తేదీ వరకు నిరంతరాయంగా కొనసాగుతుందన్నారు. ఈ మహాయాగంలో పాల్గొనదలచిన భక్తులు 93945 25457, 97033 85020, 93948 28268లలో సంప్రదించి తమ పేర్లను నమోదు చేసుకోవాలని ఆయన కోరారు.

శంషాబాద్ మున్సిపాలిటీకి రూ.50 కోట్లు

శంషాబాద్ : హెచ్‌ఎండీఏ నుంచి శంషాబాద్ మున్సిపాలిటీలో వివిధ అభివృద్ధి పనుల నిమిత్తం రూ.50 కోట్ల నిధులు మంజూరయ్యాయి. గురువారం రాష్ట్ర పురపాలక శాఖ ప్రత్యేక కార్యదర్శి అరవింద్‌కుమార్ పరిపాలన ఉత్తర్వులు జారీ చేశారు. చేవెళ్ల ఎంపీ రంజిత్‌రెడ్డి, రాజేంద్రనగర్ ఎమ్మెల్యే టి. ప్రకాష్‌గౌడ్‌లు పురపాలక శాఖ మంత్రి కేటీఆర్ నిధులు విడుదల చేయాలని గతంలో కోరగా వారి విన్నపం మేరకు మంత్రి కేటీఆర్ హెచ్‌ఎండీఏ ద్వారా రూ. 50 కోట్ల నిధులు మంజూరు చేయించారు.రంజిత్‌రెడ్డి మంత్రి కేటీఆర్‌ను కలిసి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.



మంత్రి కేటీఆర్‌కు కృతజ్ఞతలు తెలుపుతున్న చేవెళ్ల ఎంపీ రంజిత్‌రెడ్డి

అమర వీరులకు నివాళులు



నార్సింగిలో ఉత్తమ సేవాపత్రం అందుకుంటున్న కోకాపేట కౌన్సిలర్ శివారెడ్డి



మణికొండలో ఉత్తమ సేవాపత్రం అందుకుంటున్న కౌన్సిలర్ శైలజవినోద్

మణికొండ: దశాబ్ది ఉత్సవాల ముగింపులో భాగంగా గురువారం తెలంగాణ అమరవీరులకు ప్రజాప్రతినిధులు, నాయకులు నివాళులు అర్పించారు. మణికొండ, నార్సింగి మున్సిపాలిటీ కార్యాలయాలోనరేందర్‌ముదిరాజ్, డి.రేఖ యాదగిరిల అధ్యక్షతన కార్యక్రమాలు జరిగాయి. అనంతరం మున్సిపాలిటీల పరిధిలో ఉత్తమ సేవలు అందిస్తున్న కౌన్సిలర్లకు సేవా ప్రశంసపత్రాలు అందజేశారు. ఈ కార్యక్రమాల్లో మున్సిపల్ కమిషనర్లు ఫల్గుణ్‌కుమార్, సత్యబాబు, వైస్ చైర్మన్‌లు నరేందర్‌రెడ్డి, వెంకటేశ్‌యాదవ్, నేతలు అధికారులు, రామకృష్ణారెడ్డి, దివ్యజ్యోతి, నరసింహరాజు తదితరులు పాల్గొన్నారు.

బీఆర్‌ఎస్ ఆధ్వర్యంలో...

బీఆర్‌ఎస్ పార్టీ ఆధ్వర్యంలో మణికొండ మున్సిపల్ కార్యాలయ చౌరస్తాలో తెలంగాణ అమర వీరులకు నివాళులు అర్పించారు. ఉద్యమంలో పాల్గొన్న అప్పటి కార్యకర్తలు లక్ష్మయ్య, వసంతరావులకు సన్మానం చేశారు. పార్టీ అధ్యక్షుడు బి.శ్రీరాములు, రామకృష్ణారెడ్డి, నవీన్‌కుమార్,యాలాల నరేష్, బషీర్, జయరాజ్, సత్యనారాయణ పాల్గొన్నారు.

అమరులకు శ్రద్ధాంజలి

ఏజీవర్సిటీ: శ్రీ కొండా లక్ష్మణ్ ఉద్యాన విశ్వవిద్యాలయంలో అమరుల సంస్మరణ దినోత్సవం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో విశ్వవిద్యాలయ డీన్, ప్రొఫెసర్లు, విద్యార్థులు పాల్గొన్నారు.

మొక్కలు నాటి సంరక్షించాలి

బండ్లగూడ: పర్యావరణాన్ని కాపాడేందుకు ప్రతి ఒక్కరు మొక్కలు నాటాలని బండ్లగూడ జాగీరు మున్సిపల్ కార్పొరేషన్ మేయర్ బుర్ర మహేందర్‌గౌడ్ అన్నారు. గురువారం ఆయన పుట్టినరోజు సందర్భంగా కార్పొరేషన్ కార్యాలయం ముందు రాజ్యసభ సభ్యుడు జోగినపల్లి సంతోష్‌కుమార్ గ్రీన్ ఇండియా ఛాలెంజ్‌లో భాగంగా మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పర్యావరణంలో వస్తున్న మార్పులను దృష్టిలో ఉంచుకుని పర్యావరణాన్ని రక్షించే బాధ్యత ప్రతి ఒక్కరికి ఉందన్నారు. కార్యక్రమంలో కమిషనర్ వేణుగోపాల్‌రెడ్డి, డిప్యూటీ మేయర్ రాజేందర్‌రెడ్డి, కార్పొరేటర్లు సాగర్‌గౌడ్, తలారీ చంద్రశేఖర్, పద్మావతిపాపయ్యయాదవ్, శ్రీలతసురేష్‌గౌడ్, అనితవెంకటేష్, పుష్పమ్మ తదితరులు పాల్గొన్నారు.



మొక్క నాటుతున్న మేయర్ మహేందర్‌గౌడ్ తదితరులు

పండగలు ప్రశాంతంగా చేసుకోవాలి

అత్తాపూర్: పండగలను ప్రశాంతంగా జరుపుకోవాలని రాజేంద్రనగర్ డీసీపీ జగదీశ్వర్‌రెడ్డి అన్నారు. బక్రీద్‌ను పురస్కరించుకుని అత్తాపూర్ పోలీస్‌స్టేషన్‌లో ముస్లిం మతపెద్దలతో ప్రత్యేకంగా సమావేశమయ్యారు. ఒకరి పండుగలను ఒకరు గౌరవించుకుంటూ ఆనందోత్సవాల మధ్య నిర్వహించుకోవాలన్నారు. కార్యక్రమంలో ఏసీపీ గంగాధర్, అత్తాపూర్ ఇన్‌స్పెక్టర్ పులి యాదగిరి, ఎస్సై శ్రీకాంత్‌రెడ్డి, కిషన్‌సింగ్, ఏఎస్సై ప్రభాకర్, మహ్మద్ జహంగీర్, అక్బరుద్దీన్, మహ్మద్ హర్షద్ అలీ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న రాజేంద్రనగర్ డీసీపీ జగదీశ్వర్‌రెడ్డి

కాంగ్రెస్ నాయకుల సమావేశం

బండ్లగూడ: బండ్లగూడ జాగీరు మున్సిపల్ కార్పొరేషన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు పూలపల్లి కృష్ణారెడ్డి ఆధ్వర్యంలో కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తల సమావేశాన్ని గురువారం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా టీపీసీసీ ప్రధాన కార్యదర్శి బొర్రా జ్ఞానేశ్వర్‌ముదిరాజ్ హాజరై మాట్లాడుతూ ఈ నెల 25వ తేదీన బండ్లగూడ జాగీరు మున్సిపల్ కార్పొరేషన్‌లో హాత్ సే హాత్ జోడో అభియాన్ యాత్ర ప్రారంభం కానుందని నాయకులు, కార్యకర్తలు పాల్గొని విజయవంతం చేయాలని కోరారు. సమావేశంలో కార్పొరేటర్లు, కౌన్సిలర్లు, మాజీ సర్పంచ్‌లు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న టీపీసీసీ ప్రధాన కార్యదర్శి జ్ఞానేశ్వర్‌ముదిరాజ్

చిత్రపురిలో నీటి సమస్య రానివ్వం



బోరు పనులను ప్రారంభించిన మున్సిపల్ చైర్మన్ నరేందర్‌ముదిరాజ్

మణికొండ: చిత్రపురి కాలనీలో మొక్కలు, ప్రజావసరాలకు నీరు చాలకపోవటంతో గురువారం బోరు పనులను మున్సిపల్ చైర్మన్ కె. నరేందర్‌ముదిరాజ్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి కాలనీలో అవసరమైన మేర పచ్చదనాన్ని పెంపొందించాల్సిన అవసరం ఉందన్నారు. చిత్రపురి కాలనీలో నీటికి ఇబ్బంది కలగకుండా బోరు పనులను చేపట్టామన్నారు. మున్సిపాలిటీ పరిధిలోని పార్కులు, కమ్యూనిటీహాల్‌లలో అవసరమైన మేరకు నీటి సౌకర్యాన్ని కల్పించేందుకు బోర్లు వేస్తామన్నారు. కార్యక్రమంలో వైస్ చైర్మన్ కె. నరేందర్‌రెడ్డి, బీఆర్‌ఎస్ మున్సిపల్ ఫ్లోర్ లీడర్ కె.రామకృష్ణారెడ్డి, కౌన్సిలర్‌లు హైమాంజలి అనిల్‌కుమార్, వసంతరావు, కె.లక్ష్మీనారాయణ, కోఆప్షన్ సభ్యుడు తాజుద్దీన్, కాలనీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు సూర్యనారాయణ, కార్యదర్శి రమణమూర్తి, నాయకులు బాలాజీ, సరోజిని తదితరులు పాల్గొన్నారు.

గోల్కొండ కోటకు.. బంగారు బోనం

చార్మినార్: బంగారు పాత్రలో నైవేద్యం, పట్టు వస్త్రాలతో సామూహిక ఊరేగింపు పాతబస్తీలో భక్తిశ్రద్ధలతో కొనసాగింది. జోగిని నిషా క్రాంతి గౌలిపురాలోని కోట మైసమ్మ ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం ఊరేగింపు ప్రారంభమైంది. బ్యాండ్‌మేళాలు.. పోతరాజుల నృత్యాలు.. అలరించాయి. జోగిని నిషా క్రాంతి తలపై బంగారు బోనాన్ని పెట్టుకొని చేతిలో చర్నకోలా పట్టుకొని నృత్యం చేస్తూ సాగింది. అక్కడక్కడ మహిళా భక్తులు మంచినీటితో సాక పోసి స్వాగతం పలికారు. గౌలిపురా మార్కెట్, బేలా ముత్యాలమ్మ, లాల్‌దర్వాజా మోడ్ మీదుగా లంగర్‌హౌజ్‌కు చేరుకొని గోల్కొండ కోటకు బయలుదేరింది. కోటలో అమ్మవారికి శాస్త్రోక్తంగా బోనం, పట్టు వస్త్రాలను సమర్పించారు. కార్యక్రమంలో భాగ్యనగర్ శ్రీ మహంకాళి జాతర బోనాల ఉత్సవాల ఉమ్మడి ఆలయాల ఊరేగింపు కమిటీ అధ్యక్షుడు ఆలే భాస్కర్‌రాజ్, ప్రధాన కార్యదర్శి గాజుల రాహుల్, ఉపాధ్యక్షులు శ్రీధర్, కార్యదర్శి భవానీ శంకర్‌తో పాటు కమిటీ మాజీ అధ్యక్షులు గాజుల అంజయ్య, మధుసూదన్ గౌడ్, రాకేశ్ తివారీ, గౌలిపురా కార్పొరేటర్ ఆలే భాగ్యలక్ష్మి, మాజీ కార్పొరేటర్ ఆలే జితేంద్ర, ప్రతినిధులు కె.ఎస్.ఆనంద్ రావు, ప్యారసాని వెంకటేశ్, ఆదర్శ మహేశ్ పాల్గొన్నారు.



అభివృద్ధిపై ప్రచారం.. బీజేపీ కరపత్రాల పంపిణీ

రాజేంద్రనగర్: కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెడుతున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలను అర్హులైన ప్రతిఒక్కరికి అందేలా ప్రతి నాయకుడు, కార్యకర్త కష్టపడి పనిచేయాలని రంగారెడ్డి జిల్లా ప్రధాన కార్యదర్శి వై.శ్రీధర్ అన్నారు. రాజేంద్రనగర్ డివిజన్ అధ్యక్షుడు బాబురావు ఆధ్వర్యంలో మాణిక్యమ్మ కాలనీ, ఇంద్రారెడ్డినగర్ తదితర ప్రాంతాల్లో ఇంటింటికి బీజేపీ కార్యక్రమం నిర్వహించారు. శ్రీధర్ ఇంటింటికి తిరుగుతూ బీజేపీ చేపడుతున్న అభివృద్ధి, సంక్షేమ పథకాల కరపత్రాలను ప్రజలకు వివరించి అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఒక్కో నాయకుడు కనీసం వంద కుటుంబాలను కలిసి మాట్లాడే విధంగా ప్రణాళిక రూపొందిస్తున్నామన్నారు. కార్యక్రమంలో నాయకులు కె.రాజు, ఈ.వేణుగోపాల్, జంగయ్య, సందీప్‌యాదవ్, అరుణ్ తదితరులు పాల్గొన్నారు. అలాగే మైలార్‌దేవ్‌పల్లి డివిజన్ పరిధిలోని మార్కండేయనగర్‌లో కార్పొరేటర్ తోకల శ్రీనివాస్‌రెడ్డి ఆధ్వర్యంలో నాయకులు, కార్యకర్తలు ఘర్ ఘర్ మోడీ 9 సంవత్సరాల సేవ, సుపరిపాలన కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో డివిజన్ ప్రెసిడెంట్ జనార్దన్, ధనలక్ష్మి, నవారు మురళీ, చింటూ, రమేష్‌రెడ్డి, బుచ్చిరెడ్డి, ఎల్.వి.రెడ్డి, నర్సింహ్మ, అభిలాష్, మధుసూదన్, చిన్న, కృష్ణ, భారత్ తదితరులు పాల్గొన్నారు.

అత్తాపూర్‌లో..

అత్తాపూర్: అత్తాపూర్ డివిజన్ పరిధిలో ఇంటింటికి బీజేపీ కార్యక్రమాన్ని నిర్వహించారు. నరేంద్రమోడీ ప్రభుత్వం ప్రజల కోసం చేపడుతున్న పథకాల కరపత్రాలను పంపిణి చేశారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ సంగీతగౌరీశంకర్ మాట్లాడుతూ ప్రజలు మరోసారి మోడీ పాలన కోరుకుంటున్నారన్నారు. తెలంగాణలోనూ బీజేపీ అధికారంలోకి వస్తుందన్నారు. కార్యక్రమంలో బీసీ మోర్చా జిల్లా ప్రధాన కార్యదర్శి సులిగె వెంకటేష్, మ్యాడం రాము, శ్రీకాంత్‌చారి, వంశీ పాల్గొన్నారు.



రాజేంద్రనగర్‌లో ఇంటింటి ప్రచారం చేస్తున్న బీజేపీ నాయకులు



మార్కండేయనగర్‌లో కరపత్రాలను పంపిణీ చేస్తున్న కార్పొరేటర్ తోకల శ్రీనివాస్‌రెడ్డి

ఆర్‌జీఐఏ పీఎస్‌లో ముగ్గురు ఎస్సైల బదిలీ

శంషాబాద్: సైబరాబాద్ కమిషనరేట్ పరిధిలో జరిగిన ఎస్సైల బదిలీల్లో భాగంగా ఆర్‌జీఐఏ పోలీస్ స్టేషన్‌లో విధులు నిర్వహిస్తున్న ముగ్గురు ఎస్సైలు దేవరాజ్, భానుమతి, సుశీల బదిలీ అయ్యారు. మైలార్‌దేవ్‌పల్లి పోలీస్‌స్టేషన్‌లో పనిచేస్తున్న మహిళా ఎస్సై ప్రేమలత ఆర్‌జీఐఏ పీఎస్‌కు బదిలీ అయ్యారు.

భారత ఆహార సంస్థలో యోగా దినోత్సవం

నాంపల్లి: భారత ఆహార సంస్థ (ఎఫ్‌సీఐ) ఆధ్వర్యంలో హైదరాబాద్‌లోని ప్రాంతీయ కార్యాలయంలో అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని పురస్కరించుకుని ఉద్యోగులు యోగాసనాలను ప్రదర్శించారు. ప్రముఖ యోగా నిపుణులు, ఏజీ-3 (టెక్నికల్) ఎం.జి.చందన యోగాసనాల్లో తర్ఫీదు ఇచ్చారు. కార్యక్రమంలో జీఎం(ఆర్) దీపక్ శర్మ, డీజీఎం (జి) రోహిత్ గార్గ్, అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

కేసీఆర్ దిష్టిబొమ్మ దహనం

అబిడ్స్: ధూల్‌పేట నాయీ బస్తీలో సీఎం కేసీఆర్ దిష్టిబొమ్మను దహనం చేశారు. రాష్ట్ర కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి నిర్మల్‌కుమార్‌యాదవ్ ఆధ్వర్యంలో కేసీఆర్ దిష్టిబొమ్మను దహనం చేసి నినాదాలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పదేళ్లల్లో అమరవీరుల కుటుంబాలకు కేసీఆర్ ప్రభుత్వం ఏమీ చేయలేదన్నారు. కేవలం ప్రచారమే తప్పా.. ప్రగతి లేదని ఆయన అన్నారు.